సాక్షి
నల్లగొండ
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



పన్నులు తగ్గించడంతో..
జీఎస్టీ సంస్కరణలతో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు. - IIలో



బత్తాయి ధర మరింత పతనం
బత్తాయి దిగుబడి సీజన్ ముగుస్తున్నా ధర రోజురోజుకు పడిపోతుండటం రైతాంగాన్ని కంటతడి పెట్టిస్తోంది. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,06,009 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,06,009 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,454 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,881 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

16.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

- అత్యధికంగా గుర్రంపోడు మండలంలో 43.2 మిల్లీమీటర్లు

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 16.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుర్రంపోడు మండలంలో 43.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నార్కట్‌పల్లిలో 41.3, మర్రిగూడ 35.8, వేములపల్లి 34.8, తిప్పర్తి 30.7, నల్లగొండ 30.1, మునుగోడు 32.6, మిర్యాలగూడ 30.9, చందంపేట 26.4, కట్టంగూర్ 22.4, చింతపల్లి 21.1, గట్టుప్పల్ 19.3, మాడ్గులపల్లి 19.9, కేతేపల్లి 18.8, దేవరకొండ 15.3, త్రిపురారం 15.6, నకిరేకల్ 14.2, తిరుమలగిరి సాగర్ 13.5, చిట్యాలలో 13.5, నిడమనూరు 13.0, శాలిగౌరారం 10.6, మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: నల్లగొండకు మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. హైదరాబాద్ నుంచి బయల్దేరి మంగళవారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్నారు. అనంతరం మర్రిగూడ బైపాస్‌లోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

నేడు మునుగోడుకు మంద కృష్ణ మాదిగ

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెంఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మునుగోడులో నిర్వహించే సభకు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్ తెలిపారు. సోమవారం మునుగోడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల సాధనకు నిర్వహించే సభకు మండలంలోని అన్ని రకాల పెన్షన్ దారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పందుల మల్లేష్, పందుల సంపత్ కుమార్, వెంకన్న, బోయపర్తి యాదయ్య, ఎర్రసాని గోపాల్, పందుల పర్వతాలు, పోలే రాజు, పరమేష్, శ్రీను, వికలాంగుల హక్కుల పోరాట సమితి దొమ్మాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భూసేకరణ పూర్తిచేయాలి

నల్లగొండ: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మిగిలిపోయిన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. దసరా పండుగకు ముందే అన్ని జాతీయ రహదారుల భూ సేకరణ పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ అశోక్ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ ఈఈ మురళి పాల్గొన్నారు.

ఆర్డీఓ అశోక్‌రెడ్డికి ఇన్‌చార్జ్ సీపీఓ బాధ్యతలు



నల్లగొండ: నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డికి జిల్లా ప్లానింగ్ అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీపీఓ సుబ్బారావు పదవీ విరమణ పొందడంతో సూర్యాపేట సీపీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన నల్లగొండకు సక్రమంగా రాకపోవడంతో సీపీఓ ఇన్‌చార్జ్ బాధ్యతలను నల్లగొండ ఆర్డీఓకు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



జిల్లా పోలీస్ కార్యాలయంలో వినతి పత్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 37 మంది వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. సంబంధిత ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు.

కాలనీల్లో నిరంతరం పోలీస్ పెట్రోలింగ్

నల్లగొండ: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో మహిళలు, యువతులపై వేధింపులు, ఈవ్ టీజింగ్ చేయకుండా పోలీస్ నిఘా పెట్టామని పేర్కొన్నారు. జిల్లాలో 200 దుర్గాదేవి విగ్రహాలు ఏర్పాటు చేశారని తెలిపారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాలు ఏర్పాటు చేసిన కాలనీల్లో నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండపాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. రాత్రి సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రాత్రి 10 గంటలలోపు స్పీకర్లు బంద్ చేయాలని సూచించారు.



బాలా త్రిపుర సుందరీ దేవిగా రేణుకా ఎల్లమ్మ

కనగల్: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ.. బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

- 72 వినతులు సమర్పించిన అర్జీదారులు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ: గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం ప్రజలు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. భూ సమస్యలు, పెన్షన్లు, ఇతర సమస్యలపై మొత్తం 72 వినతులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ స్వీకరించారు.

బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించాలి



తమ భూమిని బ్లాక్ లిస్టులో చేర్చారని, అందులో నుంచి తొలగించాలని నల్లగొండ మండలం, చందనపల్లి గ్రామానికి చెందిన గాదె రాజారాంరెడ్డి కలెక్టరేట్‌ను ఆశ్రయించాడు. తనకు నలుగురు కుమార్తెలు ఉన్నారని, తన భార్య చాలా ఏళ్ల క్రితమే చనిపోయిందని తెలిపాడు. తనకున్న భూమిలో తన మూడో కుమార్తెకు 4.13 ఎకరాల భూమిని గతంలో అమ్మానని, ఇంకా 2 ఎకరాల 34 కుంటల భూమి తన పేరుతో ఉందని పేర్కొన్నాడు. మిగతా కుమార్తెలు తాను అమ్మిన భూమిని బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు, తన పేరున ఉన్న భూమిని కూడా బ్లాక్ లిస్టులో పెట్టారని, దానిని తొలగించాలని విన్నవించాడు.

దర్గా భూములు ఆక్రమించుకుంటున్నారు



వినతిపత్రం చూపుతున్న హక్కుదారులు

దేవరకొండలోని సర్వే నంబర్ 405లో దర్గా భూములు ఆక్రమించుకుంటున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దేవరకొండకు చెందిన దర్గా హక్కుదారులు సయ్యద్ సిద్దిక్ అలీ, కాదర్, అంజద్‌అలీ, ఉస్మాన్ అలీ, సాబేర్, బషీర్, ఫయాజ్‌లు కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. నిర్మాణం చేసే వారిని ఆపమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని, వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతిపత్రం అందజేశారు.

దసరాకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి



గ్రీవెన్స్‌కు వచ్చిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆరు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని బీసీ సంక్షేమ హాస్టల్‌లో పని చేస్తున్న 40 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గ్రీవెన్స్ డేలో వినతి పత్రం అందజేశారు. దసరా పండుగకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వేతనాలు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రవి, వెంకులు , ఎస్.కె. చాంద్‌పాషా, రేణుక, యాదమ్మ, వసంత, శైలజ, పార్వతమ్మ, నాగలక్ష్మి, శ్రీశైలం, వెంకటయ్య, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.

నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదు

4 నెలలుగా వేతనాలు రావడం లేదని మెడికల్ కాలేజీలోని శానిటేషన్ సిబ్బంది కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. కొందరికి పాత వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రిన్సిపాల్‌ను అడిగినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని వాపోయారు. ఈ విషయంలో చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్‌ను ఆశ్రయించిన శానిటేషన్ సిబ్బంది

స్థానికంపై యంత్రాంగం బిజీ

స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు షురూ

- వార్డుల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్న అధికారులు
- జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల అధికారులతో కలెక్టర్ల భేటీ
- బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక జీఓతో ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో కార్యాచరణను వేగవంతం చేసిన యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వార్డులు, గ్రామాలు, మండలాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రిజర్వేషన్ల జాబితాలను సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. 2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్, 2024 కులగణన ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జాబితాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు.

నెలాఖరులో నోటిఫికేషన్ వచ్చేనా?

గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపించిన రిజర్వేషన్ బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ ద్వారా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పించి ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనకు వచ్చింది. మరోవైపు కోర్టు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలను ఈనెలాఖరులోగా నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక జీఓ జారీ చేసి, ఎన్నికలకు వెళ్లేలా చర్యలు చేపట్టడం, అదే విషయాన్ని కోర్టుకు తెలియజేయాలన్న ఆలోచనల్లో ఉంది. ఈమేరకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. రిజర్వేషన్ల జాబితాల ఖరారుతోపాటు పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడం వంటి పనులు పూర్తి చేసుకోవాలని పేర్కొంది. దీంతో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల యంత్రాంగం అదే పనిలో నిమగ్నమైంది.

మండలాల వారీగా ఎవరి శాతం ఎంత?

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ అధికారులు స్థానిక ఎన్నికలపై కసరత్తు మొదలు పెట్టారు. నల్లగొండలో జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీపీఓ వెంకయ్య ఆధ్వర్యంలో, సూర్యాపేట జిల్లాలో డీపీఓ యాదగిరి, జెడ్పీ సీఈఓ అప్పారావు ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను, 2024 కులగణన ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. ముందుగా మండలాల వారీగా ఎవరు ఎంత శాతం ఉన్నారనే దానిపై జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆ తరువాత గ్రామాలు, వార్డుల వారీగా కూడా జాబితాలు సిద్ధం చేస్తామని పేర్కొంటున్నారు. 2006, 2013, 2019లో రిజర్వేషన్లను పరిశీలిస్తూనే కొత్త రిజర్వేషన్ల జాబితాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుతో మారనున్న స్థానాలు

ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుండటంతో ఇప్పటివరకు ఉన్న రిజర్వేషన్లు అన్నీ మారిపోనున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటివరకు ఉన్న రిజర్వేషన్లనే అమలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని తొలగించి రిజర్వేషన్ల రొటేషన్ పద్ధతిని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో పాటు ప్రస్తుతం పెరగనున్న బీసీ రిజర్వేషన్లతో రిజర్వేషన్ల స్థానాలన్నీ మారిపోనున్నాయి. మరోవైపు బీసీలకు అధిక సంఖ్యలో సీట్లు లభించనున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన తర్వాతే మిగిలిన స్థానాలు జనరల్‌కు కేటాయించి, అందులో మొత్తంగా మహిళా రిజర్వేషన్లను 50 శాతం అమలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

జీఓ వచ్చాకే అధికారికంగా రిజర్వేషన్ల ప్రకటన

ప్రభుత్వం రిజర్వేషన్లకు సంబంధించి ఇంకా జీఓ విడుదల చేయలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏయే మండలాలు ఎంత మంది ఉన్నారనేది తేల్చాలని చెప్పింది. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేసి పెట్టుకున్న అధికారులు రిజర్వేషన్లకు సంబంధించి జనాభాను తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వం జీఓ విడుదల చేసిన తర్వాత అధికారికంగా రిజర్వేషన్ల ఖరారును ప్రకటించనున్నారు.

భూములు పట్టా చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కొత్త నందికొండ వాసులు

నల్లగొండ: కబ్జాలో ఉన్న వ్యవసాయ భూములను తమ పేరున పట్టా చేయాలని కోరుతూ సోమవారం అడవిదేవులపల్లి మండలానికి చెందిన కొత్త నందికొండ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వారు వినతి పత్రం అందజేశారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలి



నల్లగొండలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద వంటావార్పు నిర్వహించి నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు, నాయకులు

నల్లగొండ టౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల సాధన పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం డబుల్ బెడ్ రూమ్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని ఆందోళన చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొన్నిరోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గంజి నాగరాజు, సిరాజుద్దీన్, విశాలాక్షి, ప్రశాంతి, గిరిజ, రాజేష్, విజయలక్ష్మి, అనురాధ, జహంగీర్, రవి, సుల్తాన్, ఇలియాస్, వెంకటమ్మ, రజని, యాదమ్మ పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

నల్లగొండ: బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు కొన్ని శాఖల ద్వారా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మున్సిపల్ కమిషనర్ ఎన్జీ కళాశాల మైదానంలో లైటింగ్, డయాస్, తాగునీరు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సాగర్ బుద్ధవనంలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలను మిర్యాలగూడ సబ్ కలెక్టర్, నందికొండ మున్సిపల్ కమిషనర్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్, పెద్దవూర తహసీల్దార్లు దృష్టి సారించి విజయవంతం చేయాలని కోరారు.

తేదీల వారీగా సంబురాలు నిర్వహించనున్న శాఖలు..

- 23న బుద్ధవనంలో బతుకమ్మ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అదే రోజు నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో వైద్య ఆరోగ్యశాఖ, డీసీహెచ్ఎస్, యువజన సర్వీసులు, కార్మిక, మెప్మా శాఖ
- 24న వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, హ్యాండ్లూమ్స్, పశుసంవర్ధక శాఖ
- 25న మున్సిపల్, ట్రాన్స్‌కో, ఫిషరీస్, సంక్షేమ శాఖలు
- 26న డీఆర్డీఏ, డీపీఓ, సీపీఓ, ఆర్టీసీ, మెప్మా శాఖలు
- 27న అటవీ శాఖ, పోలీసు, ఎక్సైజ్, ఫైర్ ఆర్టీఓ శాఖలు
- 28న రెవెన్యూ, దేవాదాయ, సహకార, పౌరసరఫరాలు, టీఎన్జీఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు
- 29న విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖలు
- 30న బార్ అసోసియేషన్ రోటరీ క్లబ్, రెడ్ క్రాస్

పెరిగిన యూరియా వినియోగం

- మోతాదుకు మించి వాడిన రైతులు
- 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేసిన వ్యవసాయ శాఖ
- మూడు నెలల్లో 67,500 మెట్రిక్ టన్నులు సరఫరా
- అయినా యూరియా కోసం బారులుదీరుతున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో రైతులు యూరియా వినియోగాన్ని పెంచారు. వానాకాలం సీజన్‌కు జిల్లాకు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. దాని ప్రకారంగా జిల్లాకు మూడు నెలల్లో 67,500 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ఇంకా జిల్లాకు 2500 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. అయితే జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5,64,585 ఎకరాల్లో పత్తి, 5,05,160 ఎకరాల్లో వరి, కంది, జొన్న, పెసర, వేరుశనగ ఇతర పంటలు కలిపి మొత్తం 10,73,162 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. సాగు చేసిన లెక్కల ప్రకారం ఎకరానికి రెండు బస్తాల యూరియా చొప్పున వాడినా మొత్తం 43 వేల మెట్రిక్ టన్నులతో పాటు ఇతర పండ్ల తోటలు, కూరగాయల సాగుకు మరో 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైనా మొత్తం 53వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనాలు వేసి అదనంగా యూరియాను కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో 70 వేల మెట్రిక్ టన్నులు అవసరంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది. ఇప్పటికే 67,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినప్పటికీ యూరియా కోసం రైతులు బారులుదీరుతున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతంలో జూలై మొదటి వారంలోనే వర్షాలు కురవడంతో పత్తి గింజలను పెట్టుకున్నారు. అదేవిధంగా బోరు బావుల కింద వరినాట్లు కూడా వేసుకున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో జిల్లాకు వచ్చిన యూరియా నాన్ ఆయకట్టు ప్రాంతంలోని రైతులకు సరిపోయింది. ఆగస్టులో నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల చేయడం, వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఆయకట్టులో ఒకే సారి వరినాట్లు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా డిమాండ్ బాగా పెరిగి రైతులు యూరియా కోసం బారులుదీరుతున్నారు. సెప్టెంబర్‌లో ప్రతిరోజు జిల్లాకు యూరియా దిగుమతి అయినప్పటికీ యూరియా వినియోగం పెరిగి రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు.



ఎకరానికి 2 బస్తాల యూరియా వినియోగించాల్సి ఉన్నా..

వరికి ఎకరానికి 2 బస్తాల యూరియా వినియోగించాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ రైతులు ఏకంగా ఎకరానికి 4 నుంచి 5 బస్తాల యూరియాను వినియోగించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కొందరు రైతులు ముందస్తుగా వచ్చే సీజన్‌కు కూడా కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నట్లు సమాచారం. దీంతో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అవసరం మేరకే కొనాలి



“యూరియాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. రైతులు అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలి. ఎక్కువ మొతాదులో యూరియా వాడితే పంటకు నష్టమే కాని లాభం ఉండదు. నిల్వ ఉంచుకుంటే యూరియా పనికిరాదు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

ప్రైవేట్ వ్యాపారుల కృత్రిమ కొరత

జిల్లాలోని కొందరు ప్రైవేట్ వ్యాపారులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించి రైతులకు ఎక్కువ ధరకు విక్రయించారు. యూరియా 60 శాతం ప్రభుత్వ కేంద్రాలకు 40 శాతం యూరియాను ప్రైవేట్ వ్యాపారులకు కేటాయిస్తారు. ప్రభుత్వ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరగా ప్రైవేట్ దుకాణాల వద్ద అంతగా రైతులు బారులుదీరలేదు. కేవలం వారి రెగ్యులర్ రైతులకు మాత్రం రూ.400ల నుంచి రూ.450 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

బుద్ధవనంలో నేడు బతుకమ్మ సంబరాలు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో మంగళవారం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ బతుకమ్మలతో సంబరాల్లో నందికొండ మున్సిపాలిటీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారని తెలిపారు.

బీఎస్‌ఎన్‌ఎల్ బంపర్ ఆఫర్

- నెలకు రూ.299తో ఫైబర్ ప్లాన్స్

రామగిరి (నల్లగొండ): బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి ఇంటర్నెట్, టీవీ వినియోగదారులకు అతి తక్కువ ధరలో ఆకర్షణీయమైన ఫైబర్ ప్లాన్స్ విడుదల చేసినట్లు ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ భారత్‌లో భాగంగా వినియోగదారులకు ఇంటర్నెట్, టీవీ ఛానెళ్లు, ల్యాండ్‌లైన్ ఫోన్ కనెక్షన్‌ను కేవలం నెలకు రూ.299కి అందించనున్నట్లు తెలిపారు. దీంట్లో 460 టీవీ ఛానెళ్లు, 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ 500జీబీ డేటా, ఉచిత అన్‌లిమిటెడ్ కాల్స్ కూడా ఉంటాయని పేర్కొన్నారు. 6 నెలలు, వార్షిక ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయని.. మరిన్ని వివరాలకు బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ నంబర్ 18004444ను సంప్రదించవచ్చని సూచించారు.

మూసీకి 4,391 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 4,391 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు సోమవారం కూడా నాలుగు క్రస్టు గేట్ల ద్వారా 4,102 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా 528 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 4,691 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతుంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.60 మేర అడుగులుగా నీటి మట్టం ఉంది.

లారీని ఢీకొని డీసీఎం బోల్తా

- డీసీఎంలోని కొబ్బరిబోండాలను ఎత్తుకెళ్లిన ప్రజలు



కొబ్బరిబోండాలను ఎత్తుకెళ్తున్న ప్రజలు

సూర్యాపేటటౌన్: లారీని ఓవర్‌టేక్ చేయబోయి డీసీఎం బోల్తా పడింది. డీసీఎంలోని కొబ్బరి బోండాల కోసం జనం ఎగబడ్డారు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం మట్టపల్లిలోని నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలోకి రాగానే ఏపీలోని ఏలూరు నుంచి కొబ్బరిబోండాల లోడుతో వస్తున్న డీసీఎం ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం జాతీయ రహదారి పక్కకు పడిపోవడంతో కొబ్బరిబోండాలు కింద పడిపోయాయి. దీంతో రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు డీసీఎంలోని కొబ్బరిబోండాలను ఎత్తుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ పోలీసులు తెలిపారు.

డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత

- గుండెపోటుతో మృతిచెందిన వలస కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని తోటి కార్మికుల ధర్నా
- నచ్చజెప్పేందుకు వచ్చిన పోలీసులపై దాడి
- పరిశ్రమ సెక్యూరిటీ భవనం అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం
- ముగ్గురి అరెస్ట్.. మిగతా వారు పరార్

పాలకవీడు: పాలకవీడు మండలం మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమలో పనిసే వలస కార్మికుడు ఆదివారం గుండెపోటుతో మృతిచెందగా.. అతడి కుటుంబానికి పరిహారం అందించాలని బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 220 మందికి పైగా కార్మికులు సోమవారం పరిశ్రమ వద్ద ధర్నాకు దిగారు. పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్‌ఐ ఆర్. కోటేష్, తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడే ప్రయత్నం చేయగా.. కార్మికులు ఒక్కసారిగా దూసుకొచ్చి దాడికి దిగారు. ఎస్‌ఐ చేతిలో లాఠీ లాక్కొని ఆయన వెంటపడ్డారు. రాళ్లు రువ్వుతూ పరిగెత్తించారు. పరిశ్రమ సెక్యూరిటీ భవనం అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఎస్‌ఐ కోటేష్, హోంగార్డుకు గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో నేరేడుచర్ల, గరిడేపల్లి మండలా నుంచి పోలీసులను, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. దీంతో కార్మికులు అక్కడి నుంచి పారిపోయారు. ముగ్గురిని మాత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పోలీసుల పైకి రాళ్లు రువ్వుతున్న కార్మికులు



ధ్వంసమైన పోలీసు వాహనం అద్దాలు

అసలేం జరిగిందంటే..

ఓ ఏజెన్సీ ద్వారా బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తూ పరిశ్రమకు చెందిన కాలనీలో నివాసముంటున్నారు. ఆదివారం కాలనీలో సొంత పనులు చేసుకుంటున్న సమయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినోద్(46) గుండెపోటుతో కుప్పకూలాడు. గమనించిన తోటి కార్మికులు, పరిశ్రమ వర్గాలు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పరిశ్రమ యాజమాన్యం సహకారంతో అతడి స్వస్థలానికి తరలించారు. అయితే మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని తోటి కార్మికులు సోమవారం పరిశ్రమ వద్ద ధర్నాకు దిగారు. కార్మికులు తమ ఒక రోజు వేతనం ఇచ్చేందుకు ముందుకు రాగా.. అంతే మొత్తాన్ని తాము ఇస్తామని పరిశ్రమ యాజమాన్యం హామీ ఇచ్చింది. వినిపించుకోని కార్మికులు ధర్నా ఉధృతం చేశారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వచ్చి వారితో మాట్లాడుతున్నప్పటికీ.. చెప్పేది వినకుండా దాడికి పాల్పడ్డారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

పరిశ్రమలల్లో పనిచేస్తున్న కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటాలు చేయడం తప్పుకాదని, కానీ ఆస్తులు ధ్వంసం చేయడం వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట ఎస్పీ నరసింహ అన్నారు. సోమవారం సాయంత్రం డెక్కన్ సిమెంట్ పరిశ్రమను ఆయన పరిశీలించారు. దాడికి పాల్పడి పరారైన వారిని వెతికేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వారిని పట్టుకుంటామన్నారు.



పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహ

పన్నులు తగ్గించడంతో పేదలకు మేలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

సాక్షి, యాదాద్రి : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని గంజ్ మార్కెట్ యార్డులో వ్యాపారులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో రాంచందర్‌రావు పాల్గొని ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గించాలని విమర్శించిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఎందుకు అభినందించడం లేదన్నారు. పన్నులు తగ్గించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం చేకూరుతుందన్నారు. దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతామన్నారు. జీఎస్టీ అమలుపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జీఎస్టీ సంస్కరణలతో భారత్ విశ్వగురువు కాబోతుందన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఉపాధ్యక్షులు డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, ఉపాధ్యక్షుడు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అచ్చయ్య, ప్రోగ్రాం కన్వీనర్ ఏలె చంద్రశేఖర్, భువనగిరి పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం, నాయకులు మేడి కోటేష్, ఎంగిడి లక్ష్మణ్, గజ్జెల సంతు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రాంచందర్‌రావు, నాయకులు

వైటీడీ పబ్లికేషన్ కార్యాలయం ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదగిరి కొండ పైన వైటీడీ పబ్లికేషన్ కార్యాలయాన్ని ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. వైటీడీ కార్యాలయం ప్రారంభంతో పత్రిక ప్రచురణ, సబ్‌స్క్రిప్షన్ నమోదు, పంపిణీ క్రమబద్ధంగా నిర్వహించబడతాయన్నారు. భక్తులు నేరుగా కార్యాలయానికి వచ్చి యాదగిరి మాస పత్రికను కొనుగోలు చేసి, సబ్‌స్క్రిప్షన్ చేసుకోవచ్చని వెల్లడించారు. యాదగిరి మాసపత్రిక ద్వారా ఆలయం, భక్తుల మధ్య మరింత అనుబంధం ఏర్పడి, ఆలయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశేషాలు విస్తృతంగా వ్యాప్తి చెందుతాయన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

హుండీ ఆదాయం రూ.2 కోట్లు

యాదగిరిగుట్ట ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను సోమవారం కొండ దిగువన శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. హుండీల్లో నగదు రూ.2,00,83,825, మిశ్రమ బంగారం 65 గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 800గ్రాములు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. అదేవిధంగా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ సైతం హుండీల్లో లభించాయని తెలిపారు. ఈ హుండీ ఆదాయం 34 రోజులదని ఈఓ పేర్కొన్నారు.

క్యాష్‌లెస్ పేమెంట్ సాకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు క్యాష్‌లెస్ పేమెంట్ సాకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి కోరారు. యాదగిరి కొండ పైన పలు చోట్ల ఏర్పాటు చేసిన స్వీయ సేవా కియోస్క్ యంత్రాలను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం అఖండ దీపారాధన ప్రాంగణంలో 3, డోనార్ విభాగం, వ్రత మండపం, చొల్ట్రీస్ వద్ద ఒక్కోటి చొప్పున కియోస్క్ యంత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. దీంతో భక్తులు క్యూలో నిలబడే సమయం తగ్గి వేగంగా స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు.



యాదగిరి కొండ పైన కియోస్క్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈఓ వెంకట్రావ్

కుమార్తెను చంపిన తండ్రి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య

సూర్యాపేటటౌన్: భార్యతో గొడవపడి పదకొండు నెలల కుమార్తెను నేలకేసి కొట్టి చంపిన తండ్రిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటయ్య విలేకరులకు వెల్లడించారు. నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల వెంకటేశ్వర్లుకు గుండాల మండలానికి చెందిన కవితతో వివాహం జరిగింది. ఏడాది తర్వాత వారి మధ్య మనస్పర్ధలు రావడంతో పెద్దమనుషుల సమక్షంలో విడిపోయారు. ఆ తర్వాత 2023లో ఏపీలోని పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామానికి చెందిన నాగమణిని వెంకటేశ్వర్లు రెండో వివాహం చేసుకున్నాడు. వీరు సూర్యాపేట పట్టణంలోని ప్రియాంక కాలనీలో అద్దెకు ఉంటున్నారు. బీటెక్ చదివిన వెంకటేశ్వర్లు స్వగ్రామంలో వ్యవసాయం చేస్తూనే ఇంటి వద్ద ట్యూషన్ చెబుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

కుమార్తె పుట్టిందనే కోపంతో..

వెంకటేశ్వర్లు, నాగమణి దంపతులకు 2024 అక్టోబర్ 10న కుమార్తె భవిజ్ఞ(11 నెలలు) జన్మించింది. తనకు కుమార్తె పుట్టిందనే కోపంతో వెంకటేశ్వర్లు ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతుండేవాడు. దీంతో రెండు నెలల క్రితం నాగమణి కుమార్తెను తీసుకొని తన పుట్టింటికి వెళ్లింది. వెంకటేశ్వర్లు ఆమెకు నచ్చజెప్పి మళ్లీ కాపురానికి తీసుకొచ్చాడు. ఈ నెల 19న రాత్రి 11గంటల సమయంలో పూటుగా మద్యం తాగిన వెంకటేశ్వర్లు భార్యతో గొడవపడి ఆమెను కొడుతుండగా.. చిన్నారి భవిజ్ఞ నిద్రలేచి ఏడ్చుకుంటూ తల్లి దగ్గరకు వచ్చింది. అప్పటికే కోపంలో రగిలిపోతున్న వెంకటేశ్వర్లు తన కుమార్తె రెండు కాళ్లు పట్టుకొని నేలకేసి బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం వెంకటేశ్వర్లు బైక్‌పై పరారయ్యాడు. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లుని సోమవారం సూర్యాపేటలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడి మృతి

చిట్యాల: హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వలస కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ పరిధిలో జరిగింది. సోమవారం చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన విపుల్‌కుమార్(18) చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో నివాసముంటూ గ్రామ శివారులోని శ్రీపతి ల్యాబ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం డ్యూటీకి వెళ్లిన విపుల్‌కుమార్ రాత్రి 8గంటల సమయంలో విధులు ముగించుకుని గుండ్రాంపల్లి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరిశ్రమ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదలంఓ విపుల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నేశ్వరమ్మ గుట్టపై జైన శాసనం ఆనవాళ్లు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణ పరిధిలోని అన్నేశ్వరమ్మ గుట్టపై తెలంగాణ చరిత్ర బృందం పరిశోధనలో జిన బ్రహ్మజోగి శాసనం వెలుగుచూసింది. గుట్ట మీద బండపై చెక్కి ఉన్న జినపాదాలకు మూడువైపులా తెలుగన్నడం లిపిలో, కన్నడ భాషలో జినబ్రహ్మజోగి పాద చారుకీర్తి అని ఉన్న శాసనాన్ని చరిత్ర బృందం సోమవారం తొలిసారి గుర్తించారు. గతంలో జగిత్యాల జిల్లా వెల్లటూరు మండలం పాతగూడూరు బయట ఒక రాతిగుండుపై జైన శాసనం ఆనవాళ్లు లభించాయని, అదేవిధంగా హన్మకొండ జిల్లా కాజీపేటలోని మడికొండ, మెట్టుగుట్ట మీద జైన మత ఆనవాళ్లు కనిపించాయని, ఇప్పుడు అనేశ్వరమ్మ గుట్టపై కనిపించిన శాసనం తెలంగాణలో మూడోదని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. ఈ బృందంలో రాగి మురళి, చిక్కుల యాదగిరి, ఆలయ సంరక్షకుడు సల్ల సైదులు ఉన్నారు.



చరిత్ర బృందం గుర్తించిన పాదాలు



జైన శాసనాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ చరిత్ర బృందం

సాగర్ ఎడమ కాలువలో యువకుడి గల్లంతు



బొల్లెద్దు సతీష్

వేములపల్లి: వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామ శివారులో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో సోమవారం సాయంత్రం ఓ యువకుడు గల్లంతయ్యా డు. ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్ మరో నలుగురు యువకులతో కలిసి సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రుత్విక్ అనే బాలుడు ఈత సరిగా రాక నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా.. సతీష్ గమనించి వెంటనే రుత్విక్‌ను కాలువ ఒడ్డుకు చేర్చాడు. ఈ క్రమంలో ఆయాసం ఎక్కువై నీటి ప్రవాహంలో ఒక్కసారిగా సతీష్ గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఎడమ కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సతీష్ ఆచూకీ లభ్యం కాలేదు. సతీష్ తమ్ముడు బొల్లెద్దు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎయిమ్స్‌లో ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాల ముగింపు

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో 5వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఫార్మాకోవిజిలెన్స్‌లో భాగంగా డ్రగ్స్ మానిటరింగ్, మెడిసిన్ పనితీరు, ఉపయోగం, ట్రయల్స్ విధానం, మెడిసిన్ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, వైద్యులు రాధిక, చరణ్, మాధవి, దేబాసిస్, గెరార్డ్, రేఖ పాల్గొన్నారు.



వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

వృద్ధుడిపై దాడి చేసిన ముగ్గురికి రిమాండ్

చివ్వెంల(సూర్యాపేట): వృద్ధుడిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వి. మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి చెందిన కోట వెంకటయ్య ఈ నెల 5న గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. ఆర్థిక లావాదేవీల విషయమై అదే గ్రామానికి చెందిన కోట సురేష్, కోట శ్రవణ్‌కుమార్, కోట సాయికుమార్ అతడిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య

నేరేడుచర్ల : క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నేరేడుచర్ల పట్టణంలో జరిగింది. సోమవారం ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లలోని చింతబండలో నివాసముంటున్న రామ్ గురుస్వామి(32) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



అనంతరెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం మెల్కపట్నం గ్రామానికి చెందిన నామిరెడ్డి అనంతరెడ్డి(77) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం శనివారం తమిళనాడు రాజధాని చెన్నైకి వెళ్లి తిరిగి సోమవారం తెల్లవారుజామున రైలులో మిర్యాలగూడకు చేరుకున్నాడు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ రెండో ప్లాట్ ఫాంపై దిగిన అనంతరెడ్డి ట్రాక్ దాటుతుండగా.. నడికుడి వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

నాగారం: కుమార్తె ఇంటికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన బోడ పున్నమ్మ ఈ నెల 1న నాగారం మండలం మామిడిపల్లిలో తన కుమార్తె పేరాల మమత ఇంటికి వచ్చింది. తిరిగి అదే రోజు సాయంత్రం సూర్యాపేటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పున్నమ్మ కుమార్తె మమత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 86039, 81432 62997 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



నజీరొద్దీన్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ నజీరొద్దీన్(56) గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ఆయనకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. సూర్యాపేట జిల్లా భీమారం గ్రామానికి చెందిన నజీరొద్దీన్ 1995లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన కుటుంబంతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన కుమారుడు తిరిగొచ్చిన తర్వాత నజీరొద్దీన్ అంత్యక్రియలు పోలీసు లాంఛనాల మధ్య నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు తెలిపారు. నజీరొద్దీన్ భౌతిక కాయానికి మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ నాగభూషణం, టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, హోంగార్డుల సంఘం జిల్లా నాయకుడు కోడిరెక్క కిరణ్‌కుమార్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు.

బత్తాయి ధర మరింత పతనం

- ధరలు లేక అల్లాడుతున్న రైతులు
- నేలపాలవుతున్న బత్తాయి కాయలు
- సీజన్ చివరి దశలో ఘోరంగా పడిపోతున్న ధర

గుర్రంపోడు: ధర ఉంటే దిగుబడులు ఉండవు. దిగుబడులు ఉంటే ధర ఉండదు. ఇది సాధారణ మార్కెట్ సూత్రం. బత్తాయికి మాత్రం దిగుబడులు లేకున్నా మార్కెట్‌లో మాత్రం ధర పెరగడం లేదు. బత్తాయి దిగుబడి సీజన్ ముగుస్తున్నా ధర పెరగకపోగా రోజురోజుకు మరింతగా పడిపోతుండటం రైతాంగాన్ని కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం తోటల వద్ద టన్నుకు రూ.10వేల నుంచి రూ.13వేలకు మించి ధర లభించడం లేదు. బత్తాయి చరిత్రలో సెప్టెంబర్‌లో ఇంత తక్కువ ధర ఇదే మొదటిసారి అని రైతులు చెబుతున్నారు. సాధారణంగా సెప్టెంబర్ నాటికి బత్తాయి దిగుబడులు తగ్గిపోయి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. గత ఏడాది ఇదే సమయంలో టన్ను రూ.30వేల వరకు ధర లభించింది. అయితే ఈసారి ఇందుకు భిన్నంగా ఆగస్టు నెల కంటే తక్కువ ధరకు పడిపోవడం బత్తాయి రైతులను కలవరపెడుతోంది. కాయలు కోసే దిక్కు లేక, చెట్ల మీదనే కాయలు రాలిపోతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కనగల్ బ్రిడ్జి వద్ద ఓ రైతు బస్తాల కొద్దీ బత్తాయిలు తెచ్చి రోడ్డు పక్కన వదిలేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



నేలరాలిన బత్తాయి కాయలు

బత్తాయి సాగుపై నీలినీడలు

బత్తాయి సాగు అంటేనే నల్లగొండ జిల్లా గుర్తుకు వచ్చేది. గతంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో బత్తాయి సాగు చేసిన రైతులు నేడు 40వేల ఎకరాలకు పడిపోయింది. అయినా గిట్టుబాటు ధర లభించడం లేదు. వచ్చే ఏడాది రైతులు బత్తాయి సాగును తగ్గించే పరిస్థితులు ఏర్పడడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. ఇప్పటికే చాలామంది రైతులు బత్తాయి చెట్లను తొలగించి వరి, ఆయిల్ పామ్ సాగుకు మొగ్గుచూపుతున్నారు.

ముంచిన వర్షాలు..

ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 20 శాతం వరకు ఇంకా దిగుబడులు ఉన్నాయి. ఇప్పటిదాకా ధర కోసం ఎదురుచూసి ఇప్పుడు తక్కువ ధరకు అమ్ముకోలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీంతో బత్తాయిలు తోటల్లోనే నేలరాలుతున్నాయి. కొందరు రైతులు బత్తాయి వ్యాపారులను పిలిపించుకుని తమ తోటలను ఏదో ఒక ధరకు కోయమని కోరుతున్నారు. వరుస వర్షాలు ఈ యేడు బత్తాయి రైతును నిలువునా ముంచాయి. ఇప్పటికీ కురుస్తున్న వర్షాలతో బత్తాయికి మార్కెట్‌లో డిమాండ్ లేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఏపీలోని అనంతపురం జిల్లాలో బత్తాయి దిగుబడులు పెరగడం, అక్కడ నీటి వనరుల లభ్యత పెరిగి తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులోనూ బత్తాయి రైతులకు మంచి రోజులు కనిపించేలా లేవని వాపోతున్నారు.

పెట్టుబడి కూడా నష్టపోయాను



నాకు తొమ్మిది ఎకరాల బత్తాయి తోట ఉంది. ఈ యేడు రూ.10 లక్షల పెట్టుబడి పెట్టాను. రూ.3లక్షల పెట్టుబడి నష్టపోయాను. ధర ఎంతకూ పెరగక కాయలు రాలిపోతుండటంతో తక్కువ ధరకే కాయలు అమ్ముకున్నా. ఈ యేడు ప్రతి బత్తాయి రైతుకు పెట్టుబడి కూడా రాదు. ఈ పరిస్థితుల్లో వచ్చేసారి పెట్టుబడులు ఎలా పెట్టాలో కూడా అర్థంకావడం లేదు.

– కుందూరు కిరణ్‌రెడ్డి, రైతు, ఆరెగూడెం